# ప్రజా ప్రతిఘటనల్లో మూడంశాలు: సమైక్యత, పథకరచన, క్రమశిక్షణ

## The Trifecta of Civil Resistance: Unity, Planning, Discipline

**Hardy Merriman**

Originally published: opendemocracy.net, Novemgber 19, 2010
Translation: March 2018

# TRANSLATOR'S NOTES

# స్వేచ్ఛా ప్రజాస్వామ్యం

**ప్రపంచానికి స్వతంత్ర ఆలోచనావిధానం**

Published on Open Democracy (http://www.opendemocracy.net)

# ప్రజా ప్రతిఘటనల్లో మూడంశాలు: సమైక్యత, పథకరచన, క్రమశిక్షణ

**- హార్డి మెర్రిమ్యాన్, 19 నవంబర్ 2010**

ప్రపంచవ్యాప్తంగా అహింసాత్మక పోరాటాల విజయ వైఫల్యాలను ప్రభావితం చేసే మూడు ముఖ్యాంశాలు : సమైక్యత, పథకరచన, క్రమశిక్షణ

### రచయిత గురించి

హార్డి మెర్రిమ్యాన్ INCCలో డైరెక్టర్ ఆఫ్ ప్రోగ్రామ్స్ హోదాలో 2005 నుంచి 2007 వరకు ఉన్నారు. Gene Sharp రాసిన "Waging Nonviolent Struggle: 20th Century Potential" పుస్తకానికి సంపాదకులుగా వ్యవహరించారు. "A Guide to Effective Nonviolent Struggle" పుస్తకానికి సహరచయిత.

### అహింసాత్మక పోరాట బలాన్ని పెంచే కారకాలేవి?

రాజకీయాల్లో "అధికారం లాక్కోవడమే కాని ఇవ్వడం ఉండదు" అనే మాటను మనం గుర్తుంచుకుంటే, చారిత్రాత్మకమైన అహింసాత్మక పోరాటాలు విజయం సాధించడానికి కారణం ఆ పోరాటాలు ప్రత్యర్థుల కన్నా ఎక్కువ బలాన్నిప్రదర్శించడమే అని అర్థం అవుతుంది.

అయితే అధికారం అనేది భౌతికవనరులపై నియంత్రణ, హింసకు పాల్పడే బలసామర్థ్యాల ద్వారానే అధికారం లభిస్తుందని అందరూ భావించే సూత్రానికి ఇది విరుద్ధమైనది. అంతేకాదు, ఇది అనేక ప్రశ్నలకు కూడా జన్మనిస్తుంది. అధికారం అనేది అందరూ భావిస్తున్న సూత్రం ప్రకారం మాత్రమే లభించేదయితే ఆయుధ సంపత్తి, వనరుల సంపత్తి కలిగిన ప్రత్యర్థుల ముందు అహింసాత్మక పోరాటాలు విఫలమై పోవాలి. కాని చరిత్రను పరిశీలిస్తే విజయాలు సాధించిన అనేక అహింసాత్మక పోరాటాలు మనకు కనిపిస్తాయి.

దాదాపు శతాబ్ద కాలంలో ఇలాంటి అనేక పోరాటాలున్నాయి. ఈ పోరాటాల నేతలు, పోరాట కారణాలు విభిన్నమైనవి. కొన్ని ఉదాహరణలు చూద్దాం:

1. 1930లలో, 1940లలో భారతీయులు పెద్ద ఎత్తున సహాయనిరాకరణోద్యమం చేపట్టి స్వతంత్రం సంపాదించుకున్నారు. (ఆర్థిక బహిష్కరణలు, స్కూళ్ల బహిష్కరణలు, సమ్మెలు, శిస్తు చెల్లించడానికి నిరాకరించడం, సహాయనిరాకరణ వగైరా పద్ధతులు). ఈ సహాయనిరాకరణ వల్ల భారతదేశాన్ని పాలించడం అసాధ్యంగా మారింది. చివరకు బ్రిటీషువారు భారతదేశాన్ని వదిలి వెళ్ళడమే మంచిదనుకున్నారు.
2. 1950లలో, 1960లలో అమెరికాలోని పౌరహక్కుల ఉద్యమం అహింసాత్మక పద్ధతులతో సమానహక్కులు సాధించుకుంది. మాంట్ గోమెరీ బస్ బాయ్ కాట్, నాష్ విల్లె లంచ్ కౌంటర్ సిట్ ఇన్స్ వంటి పద్ధతులతో పోరాడారు. ఈ పోరాట పద్ధతులు సంస్థాగతమైన విభజన వ్యవస్థను బలహీనపరచాయి. జాతీయస్థాయిలో ఉద్యమానికి మద్దతు లభించింది.
3. 1965 నుంచి 1970 మధ్య కాలంలో అమెరికాలోని కాలిఫోర్నియా ద్రాక్ష తోటలపై బహిష్కరణలు, సమ్మెల వంటి పోరాట పద్ధతులతో సమైక్య రైతుకూలి సంఘం అతిచిన్న స్థాయి నుంచి, నిధులే లేని స్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదిగింది.
4. 1986లో ఫిలిప్పీన్స్ లో అమెరికా మద్దతు ఉన్న నియంత ఫెర్డినాండో మార్కోస్ కు వ్యతిరేకంగా తిరుగుబాటు మిలిటరీతో పాటు కార్యకర్తలు చేరారు. ఈ అహింసాత్మక విప్లవం పెల్లుబుకడంతో మార్కోస్ చివరకు దేశం వదిలి పారిపోవలసి వచ్చింది.
5. 1988లో చీలీ నియంత అగస్టో పినోషెట్ క్రూరమైన అణిచివేత భయాన్ని చీలీ ప్రజలు అధిగమించి భారీ ప్రదర్శనలకు పూనుకున్నారు. ఈ ప్రదర్శనలు పినోషెట్ అధికారాన్ని ఎంతగా బలహీనపరిచాయంటే, స్వయంగా ఆయన పట్ల విధేయత కలిగిన సైనికకూటమి సభ్యులు కూడా సంక్షోభం తారాస్థాయికి చేరినప్పుడు ఆయనతో ఉండలేదు. చివరకు ఆయన బలవంతంగా గద్దెను వదులుకోక తప్పలేదు.

6. 1980 నుంచి 1989 మధ్యకాలంలో పోలిష్ ప్రజలు స్వతంత్ర ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. సాలిడారిటీ ఉద్యమంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేసుకుని సోవియట్ పాలన నుంచి తమ దేశాన్ని విముక్తం చేసుకున్నారు.
7. 1989లో చెకోస్లేవేకియాలో సమ్మెలు, నిరసనలు హోరెత్తాయి. దీన్ని వెల్వెట్ విప్లవంగా పిలుస్తారు. చివరకు చెకొస్లోవేకియాలో కమ్యునిస్టు వ్యవస్థ అంతరించింది. ఇలాంటి ప్రతిఘటనలే తూర్పు జర్మనీ, లాత్వియా, లిథువేనియా, ఈస్తోనియాల్లోను 1991లో శాంతియుత మార్పులకు దారితీశాయి.
8. 1980లలో దక్షిణాఫ్రికాలో సమ్మెలు, బహిష్కరణలు, సహాయనిరాకరణ, అంతర్జాతీయ ఆంక్షలు చివరకు 1990 వచ్చే నాటికి జాత్యాహంకార వ్యవస్థను కుప్పకూల్చాయి.
9. ఆ తర్వాతి దశాబ్దాలలో సెర్బులు (2000), జార్జియన్లు (2003), ఉక్రేనియన్లు (2004) అక్రమ ఎన్నికలను అడ్డుకోడానికి ప్రజా ప్రతిఘటనలతో ఉద్యమించి నిరంకుశ పోకడలను అడ్డుకున్నారు.
10. 2005లో లెబనాన్ ప్రజలు తమ భూభాగాలపై సిరియా దురాక్రమణలను అహింసాత్మక పోరాటాలతో తొలగించారు.
11. 2006లో నేపాలీ ప్రజలు ప్రజాప్రతిఘటనల ద్వారా పౌరపరిపాలనను పునరుద్ధరించుకున్నారు.
12. 2007 నుంచి 2009 మధ్యకాలంలో హింసాత్మక దాడులు, సైనికపరిపాలకుడి అణిచివేతలను ఎదిరిస్తూ పాకిస్తాన్ లో న్యాయవాదులు, పౌరసమాజ గ్రూపులు, సాధారణ ప్రజలు విజయవంతంగా స్వతంత్ర న్యాయవ్యవస్థను సాధించడమే కాదు ఎమర్జన్సీ ఎత్తివేసేలా చేసారు.

**ప్రజలు విధేయత చూపకపోతే పాలకులు పాలించలేరు**

ఈ ఉద్యమాలు ఇలాంటి అనేక ఉద్యమాలు విజయవంతం కావడానికి కారణం ఇవి అధికారానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలపై నడిచాయి. ఒక సమాజంలోని అన్ని వ్యవస్థలు, సంస్థలు, సంఘాలన్నీ నిరంతరంగా కొనసాగే సాధారణ ప్రజల విధేయత, సమ్మతి, సహకారాలపై ఆధారపడి ఉంటాయి. ప్రజలు విధేయతను, సమ్మతిని

వ్యూహాత్మకంగా, ప్రణాళికాబద్ధంగా ఉపసంహరించుకుంటే అప్పుడు గొప్ప ఒత్తిడిని వేయగలరు. ప్రజలు విధేయత చూపకపోతే దేశాల అధ్యక్షులు గాని, నగరాల మేయర్లు గాని, కార్యనిర్వాహణాధికారులు గాని, సైనిక జనరల్స్ కాని ఎవరూ అపరమిత అధికారాలతో పాలించడం అనేది సాధ్యపడదు.

అహింసాత్మక ఎత్తుగడలు, అంటే సమ్మెలు, బహిష్కరణలు, భారీ ప్రదర్శనలు, సహాయనిరాకరణ, సమాంతర సంస్థలను ఏర్పాటు చేసుకోవడం, ఇలాంటి వందలాది సృజనాత్మక పోరాటపద్ధతులను ఉపయోగించడం జరుగుతుంది. ఈ పద్ధతులను నైతికమైన కట్టుబాటు వల్ల ఉపయోగించడం జరగదు. కేవలం ఆచరణాత్మక ప్రయోజనాల కారణంగా ఉపయోగించడం జరుగుతుంది. ప్రజా ప్రతిఘటన పంథా అనుసరించిన కొందరు ప్రపంచంలో ఇతర దేశాల్లో ఇలాంటి పద్ధతులే విజయాలు సాధించడాన్ని చూస్తున్నారు. కాబట్టి తమకు అందుబాటులో ఉన్న పద్ధతుల్లో ఇదే ఉత్తమమైనదిగా భావిస్తున్నారు.

## నైపుణ్యాలు పరిస్థితులు

అహింసాత్మక పోరాటాలు సాధించిన ఈ స్ఫూర్తిదాయకమైన విజయాలతోపాటు చరిత్రలోను, సమకాలీన సంఘటనల్లోను పరిశీలిస్తే విఫలమైన ఉద్యమాలు కూడా కనిపిస్తాయి. పోలెండ్, చెకొస్లోవేకియా ఉద్యమాలు జరిగిన సంవత్సరమే ప్రపంచం తియానన్మేన్ స్క్వేర్ ఊచకోతలను కూడా చూసింది. గత దశాబ్దంలో చాలా మంది అహింసాత్మక పద్ధతులను అవలంబించారు. బర్మా, జింబాబ్వే, ఈజిప్టు, ఈరాన్ తదితర చోట్ల, కాని ఈ ఉద్యమాల లక్ష్యాలు పూర్తికాలేదు. తూర్పు తిమోర్ లో విజయవంతంగా ముగిసిన స్వయంనిర్ణయాధికార పోరాటం సహాయనిరాకరణ అనేది కాదనలేని ఆయుధం. అది ఇతర ప్రాంతాల్లోను ప్రజా ప్రతిఘటనలకు ప్రేరణ అయ్యింది. పలస్తీనా, పశ్చిమ పపూవా, పశ్చిమ సహారా, టిబెట్ లలో పోరాటాలు ఇంకా లక్ష్యాలను సాధించలేదు.

విజయాలు సాధించిన పోరాటాలకు విఫలమైన వాటికి మధ్య భేదం ఏమిటి?

ఈ ఉద్యమాలు విజయవంతం కావడానికి, విఫలమవ్వడానికి దారితీసిన కారణాల విషయమై భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. ప్రతి ప్రాంతంలోను పరిస్థితి అత్యంత సంక్లిష్టమైనది. కాబట్టి ప్రత్యక్షంగా కారణాలను వెదికి పట్టుకోవడం చాలా కష్టం. అయితే మేధావులు, పాత్రికేయులు తదితరులు ఈ ఉద్యమాల దశదిశను నిర్దేశించే కారణాలుగా

చూపించినవి సాధారణంగా విభిన్న ఉద్యమాల నిర్మాణానికి సంబంధించినవి, నిర్దిష్ట పరిస్థితులకు సంబంధించినవి.

ఉదాహరణకు, నియంతలు క్రూరంగా అణిచివేతలకు పూనుకోని సమాజాల్లో మాత్రమే అహింసాత్మక పోరాటాలు విజయం సాధించాయని చెప్పడం. అలాగే కొన్ని ఆర్థికపరమైన పరిస్థితులు (ఆర్థిక సిద్ధాంతాలు, ఆదాయ స్థాయి, సంపద పంపిణి, మధ్యతరగతి ఉండడం వగైరా) వీటితో పాటు విద్యాపరమైన పరిస్థితి వంటివి అహింసాత్మక పోరాటాల విజయానికి ముఖ్యమైనవిగా భావిస్తారు. ఇంకొందరి అభిప్రాయం ప్రకారం అగ్రరాజ్యాలు పోషించే పాత్ర, ప్రాంతీయ నియంతల వైఖరి మిగిలిన అన్ని కారణాల కన్నా ముఖ్యమైనవిగా భావిస్తారు. మనం చెప్పగలిగిన పరిస్థితులు, నిర్మాణాలను పరిశీలిస్తే – జాతిపరమైన వైవిధ్యం, రాజకీయ సాంస్కృతిక చరిత్ర, జనాభా సంఖ్య, ప్రాదేశిక విస్తీర్ణం ఇలాంటివి అనేకం ఉండవచ్చు. ఈ పరిస్థితుల్లో చాలా పరిస్థితులు ఒక ఉద్యమ ఫలితాలపై ప్రభావం వేయవచ్చు.

అయితే ఈ నిర్మాణానికి, పరిస్థితులకు సంబంధించిన వాదనకు జవాబుగా మరో వాదన ఉంది. పోరాటాన్ని కొనసాగించే నైపుణ్యం లేదా కార్యాచరణ. నైపుణ్యాలు లేదా కార్యాచరణ ఎలాంటివంటే ఈ విషయంలో ఉద్యమానికి కొంత నియంత్రణ ఉంటుంది. ఉద్యమం కార్యాచరణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి? ప్రజలను సమీకరించడానికి, వారిని ఉద్యమంలో పాల్గొనేలా చేయడానికి ఎలాంటి భాష వాడాలి? ఉద్యమం సంకీర్ణాలను ఎలా నిర్మిస్తోంది? ప్రత్యర్థిని ఎలా, ఎప్పుడు లక్ష్యంగా చేసుకుంటుంది? ఇలాంటి అనేక అంశాలు ఒక అహింసాత్మక పోరాటంలో ఉంటాయి.

నా అభిప్రాయం ప్రకారం నైపుణ్యాలకు సంబంధించిన ఈ అంశాల పట్ల పెద్దగా శ్రద్ధ చూపడం జరగలేదు. అహింసాత్మక పోరాటాలను పరిశీలించినవారు, విశ్లేషించినవారు వీటిపై దృష్టి పెద్దగా పెట్టలేదు. అలా ఎందుకు జరిగిందంటే అది ఈ వ్యాసంలో చర్చించడానికి సరిపోదు. బహుశా ఒక కారణమేమంటే, అహింసాత్మక పోరాటాలు ఏ పునాదులపై ఆధారపడ్డాయో వాటి గురించి అవగాహన లేకపోవడం లేదా వాటి పట్ల అపనమ్మకం కావచ్చు. సామూహిక కార్యాచరణలో మార్పుల ద్వారా అణిచివేతకు పాల్పడే ప్రత్యర్థి చేతుల్లోని అధికారాన్ని ప్రజా ఉద్యమం లాక్కోగలదన్న విషయమై సంశయమూ కావచ్చు. దానికి బదులు అసాధారణ

పరిస్థితులు, బాహ్యమైన కారణాల వల్ల అహింసాత్మక పోరాటాలు విజయం సాధిస్తాయన్న అభిప్రాయంతో ఉంటారు.

ఉద్యమంలో నిర్మాణం, పరిస్థితుల ప్రాముఖ్యాన్ని మనం కాదనలేము. అయితే దాంతో పాటు నైపుణ్యాలు, కార్యాచరణ ప్రాముఖ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. నిజానికి నైపుణ్యాలు, కార్యాచరణల వల్ల చాలా పెద్ద ప్రభావం పడుతుంది. చాలా సందర్భాల్లో ఈ లక్షణాలు అడ్డంకులను అధిగమించడానికి, ప్రతికూల పరిస్థితులను మార్చడానికి ఉపయోగపడతాయి.

వ్యాపారరంగంలో లేదా సైనికరంగంలో ఇలాంటి ఇతర రంగాల్లో నైపుణ్యం, కార్యాచరణలను సాధారణ పరిజ్ఞానంగా పరిగణిస్తారు. అలాంటప్పుడు అహింసాత్మక పోరాటం ఈ రంగాలను భిన్నంగా ఎందుకుండాలి. ఒక మిలిటరీ జనరల్ లేదా ఒక కార్పోరేషన్ సి.యి.ఓలతో వ్యూహం, పథకరచన అంత ముఖ్యం కాదని చెబితే నవ్వుకుంటాడు. సన్ ట్జూ రాసిన క్లాసిక్ ”ది ఆర్ట్ ఆఫ్ వార్“లో సంఘర్షణ, ఘర్షణాత్మక ఘటనలన్నీ కేవలం పరిస్థితుల కారణంగానే అయితే దానికి అంత ప్రాముఖ్యం ఉండేదే కాదు.

కాబట్టి, ఈ వ్యాసం ప్రారంభంలో అడిగిన ప్రశ్నకే మళ్లీ వద్దాం. అహింసాత్మక పోరాటాలు ఎందుకు విజయం సాధిస్తాయి? మనం సమాధానాల కోసం చారిత్రాత్మక ఉద్యమాల్లో వ్యూహాత్మక కార్యాచరణ, ఉత్తమ ప్రాక్టీసులను పరిశీలించాలి. ఒక ఉద్యమంపై ప్రభావం వేసే అనేక నైపుణ్యాలు, కార్యాచరణకు సంబంధించిన అంశాలున్నాయి. అయితే, మనం వాటిలో కొన్ని ముఖ్యమైనవాటిని గమనిస్తే విజయవంతమైన అహింసాత్మక ఉద్యమాల్లో మూడు ముఖ్యమైన లక్షణాలు కనిపిస్తాయి. సమైక్యత, పథకరచన, క్రమశిక్షణ

## సమైక్యత, పథకరచన, క్రమశిక్షణ

మొదటి చూపులోనే ఈ మూడు అంశాలు ముఖ్యమైనవన్నది అర్థమవుతుంది. అయితే వాటి ప్రాముఖ్యం గురించి లోతుగా పరిశీలించడం, వాటి ప్రభావాలు ఎంత బలంగా ఉంటాయన్నది గమనించడం చాలా సందర్భాల్లో జరగదు. ముఖ్యంగా ఉద్యమాలను పరిశీలిస్తున్నప్పుడు ఈ వాస్తవాల పట్ల శ్రద్ధ వహించడం జరగదు. ముఖ్యంగా ఉద్యమాలను పరిశీలిస్తున్నప్పుడు ఈ వాస్తవాల పట్ల శ్రద్ధ వహించడం జరగదు.

సమైక్యత అనేది చాలా ముఖ్యమైనది, ఎందుకంటే అహింసాత్మక ఉద్యమాలకు బలం సమాజంలోని  వివిధ వర్గాల ప్రజలందరూ ఉద్యమంలో పాల్గొనడం వల్లనే లభిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే ఎంత ఎక్కువ మంది ఉద్యమంలో ఉన్నారన్నదే ముఖ్యం. ఎంత ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఒక ఉద్యమానికి మద్దతిస్తే అంతగా ఆ ఉద్యమానికి న్యాయబద్ధత, బలం, అధికారం, వ్యూహాత్మక సానుకూలత లభిస్తాయి. అందువల్లనే విజయవంతమైన ఉద్యమాలన్ని కొత్త కొత్త సముదాయాలను, వర్గాలను కూడా పోరాటంలో కలుపుకునే ప్రయత్నం చేశాయి. సమాజంలో ప్రతి ఒక వర్గం పోరాటంతో మమేకమయ్యేలా చేశాయి. ఉదాహరణకు పురుషులు, స్త్రీలు, యువకులు, పెద్దలు, వృద్ధులు, పట్టణ గ్రామీణ ప్రజలు, మైనారిటీలు, ధార్మిక సంస్థల సభ్యులు, రైతులు, కార్మికులు, వ్యాపారులు, వృత్తిపనివారు, సంపన్నులు, మధ్యతరగతి, దిగువ తరగతి ప్రజలు, పోలీసు, సైన్యం, న్యాయవ్యవస్థలోని సభ్యులు ఇంకా ఇలా అనేక గ్రూపుల నుంచి ప్రజలు ఉద్యమంలో వచ్చేలా చేయడం కనిపిస్తుంది.

విజయవంతమైన అహింసాత్మక ఉద్యమాలను పరిశీలిస్తే ఈ ఉద్యమాలు ప్రత్యర్థి శిబిరంలోని మద్దతుదారులను కూడా ప్రభావితం చేయడానికి ప్రయత్నించడం కనిపిస్తుంది. ఒక ఉమ్మడి లక్ష్య కోసం ప్రజలను సమీకరించినప్పుడు, ప్రజా ప్రతిఘటన కొనసాగాలంటే ప్రత్యర్థి శిబిరంలో ఫిరాయింపులను సృష్టించే సామర్థ్యం ఎంత ఉంటుందో అంతగా ప్రజా ప్రతిఘటన బలం పుంజుకుంటుంది. ఉదాహరణకు దక్షిణాఫ్రికాలోని జాత్యాహంకార వ్యతిరేక ఉద్యమం జాతీయ పునరాలోచనకు పిలుపు నివ్వడం ద్వారా విస్తృతస్థాయిలో మద్దతు సంపాదించుకోగలిగింది. మార్పు కోసం సమైక్యతను సాధించగలిగింది. చివరకు జాత్యాహంకార వ్యవస్థకు మద్దతిచ్చిన కొందరు తెల్లవారిలోను మార్పు వచ్చి ఉద్యమానికి మద్దతు పలికేలా చేశారు.

అహింసాత్మక పోరాటాన్ని నడిపేవారు సంక్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. తమ ఉద్యమం ఏ బాటన నడవాలన్న విషయమై క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. వ్యూహాత్మక పథక రచన అన్నది ఇందులో చాలా ముఖ్యమైనది. లక్ష్యం ఎంత మంచిదయినా, ప్రత్యర్థి చర్యలు ఎలాంటివైనప్పటికీ అణిచివేతపై విజయం అన్నది అప్పటికప్పుడు తీసుకునే చర్యలు, పరిస్థితిని బట్టి వెంటనే తీసుకున్న నిర్ణయాలపై

ఆధారపడి ఉండదు. ఆ చర్యలు అద్భుతంగా నిర్వహించినప్పటికీ ఉద్యమ ఫలితాలు అలాంటి చర్యలపై ఆధారపడి ఉండవు. ప్రజా ప్రతిఘటన ఒక పద్ధతి ప్రకారం లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడానికి వ్యూహాత్మకంగా పథకబద్ధంగా చర్యలు తీసుకోవడం అవసరం.

ఉద్యమం ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజల ఆకాంక్షలు, కష్టనష్టాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఎత్తుగడలను ఉపయోగించాలి? ఏ క్రమపద్ధతిలో ఉపయోగించాలి? ఎలాంటి మార్పు కారకాలను రూపొందించాలి, ఎలా గమనంలో పెట్టాలి, వ్యక్తులు లక్ష్యంగా చేసుకోవలసిందేమిటి, గ్రూపులకు లక్ష్యాలేమిటన్నది ప్లాన్ చేయడం, స్వల్పకాలిక, మధ్య కాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో అవసరమైన ఎత్తుగడలు అవలంబించడం, సమాచార పంపిణీకి అవసరమైన దారులు వేసుకోవడం, వాటి ద్వారా సంకీర్ణకూటములకు ప్రయత్నించడం వంటి విషయాలపై అహింసాత్మక పోరాటాలు సృజనాత్మకంగా పనిచేస్తాయి. ఇలా చేయడానికి ఒక సమగ్రమైన విశ్లేషణ అవసరం. అహింసాత్మక పోరాటం జరుగుతున్న సమాజంలోని పరిస్థితుల పట్ల అవగాహన అవసరం. పథకరచన ప్రక్రియలో భాగంగా విజయవంతమైన ఉద్యమాలు లాంఛనమైన పద్ధతులతో లేదా లాంఛనేతరమైన పద్దతులతో సమాచారాన్ని సేకరిస్తాయి. అట్టడుగు స్థాయి ప్రజానీకం మాటలను ఆలకిస్తాయి. వాటిని విశ్లేషిస్తాయి. ప్రత్యర్థులను, తటస్థంగా ఉన్నవారిని పోరాటంలో అనుక్షణం విశ్లేషిస్తూ ఉంటాయి.

చివరిగా ఏ వ్యూహమైనా క్రమశిక్షణతో అమలు చేసినప్పుడే విజయం సాధిస్తుంది. ఒక అహింసాత్మక పోరాటంలో క్రమశిక్షణ లోపించడం వల్ల వాటిల్లే అతిపెద్ద నష్టం ఏమంటే కొందరు సభ్యులు హింసాత్మక పంథా చేపట్టడం జరగవచ్చు. అందువల్ల అహింసాత్మక క్రమశిక్షణ, అంటే అహింసాత్మకంగా ఉండే సామర్థ్యం, ఎంతగా రెచ్చగొట్టే పరిస్థితులున్నప్పటికీ అలా కొనసాగే సామర్థ్యం. ఈ లక్షణాన్ని ఉద్యమంలో పాల్గొనే వారిలో అనుక్షణం పెంపొందిస్తూ ఉండాలి. దీనికి ఆచరణాత్మకమైన కారణాలున్నాయి. ఒక ఉద్యమంలో కొందరు హింసాత్మక సంఘటనలకు పాల్పడితే ఉద్యమం న్యాయబద్ధత పడిపోతుంది. ప్రత్యర్థికి బలప్రయోగం చేసే కారణం లభిస్తుంది. అణిచివేతకు అవకాశం లభిస్తుంది. అంతేకాదు, నిరంతరాయంగా అహింసాత్మకంగా కొనసాగే ఉద్యమం అనేకమంది

మిత్రులను సంపాదించుకునే అవకాశాలు ఉంటాయి. చివరకు ప్రత్యర్థి శిబిరంలోని ప్రత్యర్థి మద్దతుదారులు కూడా ఉద్యమ సానుభూతిపరులుగా మారవచ్చు.

ఈ నైపుణ్యాలను సమగ్రంగా చర్చిస్తే పుస్తకాలు రాయవచ్చు. అహింసాత్మక పోరాటాల ప్రాముఖ్యం అనే అంశం ఇప్పుడు మరింత ఎక్కువగా వ్యవస్థీకృత అధ్యయనాన్ని ఆకర్షిస్తోంది. తలెత్తే ప్రతి ఉద్యమం కొత్త జ్ఞానాన్నిస్తోంది. ఈ ఉద్యమాల స్వభావాన్ని అర్థం చేసుకోడానికి ఉపయోగపడుతోంది. అయినా ఈ రాజకీయ సామాజిక చర్యల ఆర్ట్ అండ్ సైన్స్ గురించి ఇంకా తెలుసుకోవలసింది ఎంతో మిగిలి ఉంది.

అయితే ఈ మూడు లక్షణాలు, సమైక్యత, పథకరచన, క్రమశిక్షణ అనేవి కాలాతీతమైనవి. ఉద్యమాలలోని సభ్యులు, మద్దతుదారులు, ఉద్యమాలను అధ్యయనం చేసేవారు, ఉద్యమాల వార్తలు రిపోర్టు చేసేవారు ఉద్యమం ఎలా కొనసాగుతుందో అర్థం చేసుకోడానికి ఈ మూడు లక్షణాలు ఎంతైనా ఉపయోగపడతాయి. ఉద్యమం సమైక్యంగా ఉందా? పథకరచన ఉందా? క్రమశిక్షణ ఉందా? అహింసాత్మక ఉద్యమాల్లో ఈ లక్షణాలు కలిగి ఉన్నవారు గొప్ప శాంతియుతమైన న్యాయబద్ధమైన ప్రపంచానికి మార్గం వేశారు. ఇలాంటి ప్రయత్నాలు చేసేవారే భవిష్యత్తును తీర్చిదిద్దుతారు.

ఈ వ్యాసం కోసం నేను విజయవంతమైన ఉద్యమాలంటే, నిర్దిష్ట లక్ష్యాలను సాధించిన ఉద్యమాలుగా నిర్వచించాను. అలాగే నిర్దేశిత లక్ష్యాలను సాధించలేని ఉద్యమాలను విఫలమైనవిగా నిర్వచించాను. ఈ నిర్వచనాల్లో కొంత అస్పష్టత ఉంది. ఒక విజయవంతమైన ఉద్యమం నిర్దేశిత లక్ష్యాలను సాధించి ఉండవచ్చు (ఉదాహరణకు ఉక్రెయిన్ లో ఆరంజ్ మూవ్ మెంట్ 2004). కాని ఆ తర్వాతి కాలంలో ఆ ఉద్యమానికి ఎదురైన సవాళ్ళ వల్ల వెనకబడిపోవచ్చు. (ఉక్రేయిన్ కేసు గురించి మరింత సమాచారానికి ఓపెన్ డెమొక్రసీలో నవంబర్ 17,2010 వ్యాసం, ఒలినా ట్రిగుబ్, ఒక్సానా షుల్యార్ రాసిన వ్యాసం The struggle after people Power wins చూడవచ్చు). అలాగే నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో విఫలమైన ఉద్యమం (చైనాలో ప్రజాస్వామ్య ఉద్యమం 1989) తర్వాతి కాలంలో ప్రభావం వేయవచ్చు. ఆ ప్రభావం నిర్మాణాత్మకంగా ఉద్యమ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్ళవచ్చు. (చైనా ఉద్యమం గురించి మరింత సమాచారానికి ఓపెన్ డెమొక్రసీలో నవంబర్ 17, 2010 తేదీ, లెస్టర్ కుర్ట్ జ్ వ్యాసం Repressions paradox

in china చూడవచ్చు). ఒక ఉద్యమం విజయవంతమైందా, విఫలమైందా అన్నది ఎలా ఉన్నప్పటికీ తర్వాతి కాలంలోని ఈ ప్రభావాలు మార్పులు చాలా శక్తివంతమైనవిగా ఉంటాయి. కాబట్టి వాటిని కూడా దృష్టిలో ఉంచుకోవడం అవసరమవుతుంది.